

## ఉగాది మినీకథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రు.75/-పొందిన కథలు




### నా గురించి



పూర్తి పేరు : పడాల వెంకట శ్రీపతిరావు పుట్టింది గొల్లప్రోలు, తూర్పుగోదావరి జిల్లా. విద్యాభ్యాసం గొల్లప్రోలు, పిఠాపురం, అనకాపల్లి, మద్రాసులలో. చదువుకొంది యం. కాం. వరకు. ఉద్యోగం హిందూస్తాన్ కంప్యూటర్స్ లిమిటెడ్, మద్రాసులో. సద్యోగం : మద్రాసు రేడియో స్టేషనులో తెలుగులో కేజువల్ ఎనౌన్సరుగా. పుస్తకాలు చదవడం, నాటకాలు ఆడడం, ఆడించడం సరదా.

తెలుగులో అభిమాన రచయితలు : రావి శాస్త్రి, బీనాదేవి, కాళీపట్నం, నంది, వీరేంద్రనాథ్, ఐ. జె. రావు.

యింకా గృహస్థాశ్రమం తీసుకోలేదు. (ఐమీన్ పెళ్ళికాలేదని.)

— శ్రీపతిరావు పడాల

---

"యువ రటెన్షన్ ప్లీజ్ ! విశాఖ నుంచి అమలాపురం పోవు సూపర్ డీలక్సు ఎక్స్‌ప్రెస్ బస్సు కొద్ది నిమిషాలలో బయలు దేరుటకు ఏడవ నెంబరు ప్లాటుఫారంపై సిద్ధంగా వున్నది."

చెవులు చిలులు పడే రణగొణ ధ్వనులమధ్య, ఎప్పుడూ పనిచేయడం చూడని లౌడు స్పీకర్లో కర్ణకఠోరమైన గొంతు విన్పించిన అరగంటకు ప్రియుణ్ణి వీడిపోలేని ప్రేయసిలా విశాఖ బస్టాండు నొదిలింది బస్సు.

"పొగ త్రాగుట నేరం" అనే బోర్డుకు కుడిపక్కన బార్కినారు దమ్ముకొడుతూ, జనానికి బస్సు రాసుకుని పోతున్నా లెక్కచేయక, ప్రజా ప్రభుత్వ వాహనానికి మటుకు డేమేజి అవకుండా చూసుకొంటూ పద్మవ్యూహంలో అభిమన్యుడిలా చొచ్చుకుపోతున్నాడు డ్రయివరు సింహాచలం.

అసలుమీద కంటె వడ్డీమీద మోజుతో టిక్కెట్లలోంచి తనకు రాబోయే "చిల్లర వాటా"ను లెక్కపెట్టుకోవడంలో నిమగ్నమయి పోయాడు కండక్టరాసురుడు.

బస్సు విశాఖ టౌనుషిప్‌దాటి, రేడియో స్టేషను మీదుగా దూసుకుపోతోంది.

"నాను మావోలు బస్సులో యెల్లిపో యెచ్చిద్దవంటే ఈ మాయదారి సూపర్ బస్సులో యెక్కించేసి, ఆవదం రాసీస్సి నావు : కుదుపులుకి ఒల్లు కుదేలైపోనాది. మరిగంటే అనకాపిల్లి వొచ్చీసినాది. దిగు దిగు" అంటూ ఓ కనకమాలచ్మి, మొగుడు అప్పలకొండని అదిలించేస్తోంది.

అనకాపల్లి బస్టాండులో ఓ డజను శాల్తీలు దిగాయి. నలుగురు పాసెంజర్లని, మరో ముగ్గురు "పాస్" ఎంజెర్లని ఎక్కించుకుని రైట్ చెప్పేశాడు కండక్టరు.

బస్సు శారదానది మీదుగా కాలేజి దాటి కసింకోట అవతల రైల్వే క్రాసింగుదగ్గర ఆగింది.

పడిపోకుండా బేలన్సు "కీపవ్" చేస్తూ బాబా బేక్ సీట్లోంచి కండక్టరు దగ్గర కొచ్చింది ఓ పదేళ్ళ పాప.

"ఏమండీ! తుని వచ్చిందా?" అంటూ. "లేదమ్మా యింకా చాలా టైమవుతుంది. తుని వచ్చాక నేను చెబుతాలే!" ఎందుకో మరి కోప్పడకుండానే జవాబిచ్చాడు కండక్టరుడు.

"తమ పాప ఒంటరిగా తాతగారింటికి వెళ్తోందని, దిగేటప్పుడు మర్చిపోకుండా గుర్తు చేయవలసిందంటూ" టిక్కెట్టు తీసేటప్పుడు ఆ హడావిడిలో, బేక్ సీట్లోని పాప తల్లి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి కండక్టరుకు. రైల్వే గేటు తెరవగానే బస్సు బయలుదేరింది. మళ్ళీ బస్సు స్పీడందుకుంది. ప్రయాణికులంతా ప్రాణాలుగ్గబెట్టుకుని కూర్చున్నారు. తాళ్ళపాలెం యివతల మాత్రం ఓ కోడిపిల్లను మట్టేసి, రోడ్డు పక్క మేస్తోన్న గేదెని దేషీయబోయి మానేసి అదే స్పీడులో ఎలమంచిలి వచ్చి చేరింది బస్సు. బస్సు స్టాండులో దిగేవాళ్ళుతప్ప, ఎక్కేవాళ్ళు లేరు. అయితే బస్టాండులోలేని జనమంతా బస్టాండుకు అవతలఉన్న కాఫీ హోటల్ దగ్గర గుమికూడి ఉన్నారు- బస్సుకోసం ఎదురుచూస్తూ! బస్టాండులో పదిసెకండ్లే ఆగినా, కాఫీ హోటల్దగ్గిరమాత్రం పది నిమిషాలాగింది బస్సు.

"కాఫీలు తాగేవాళ్ళు తాగవచ్చు" అంటూ కండక్టరు, డ్రయివరు బస్సు దిగారు. బస్సు బయలుదేరబోయేముందు, మళ్ళీ బేక్ సీట్లోని బేబీ కండక్టరు దగ్గర కొచ్చింది. "తుని యింకా రాలేదు పాపా! వచ్చాక నేను చెప్తానన్నాగా" ఈ సారి కొంచెం విసుక్కుంటూనే జవాబిచ్చాడు కండక్టరు. జవాబివ్వడంలో విసుగు ధ్వనించినా, తుని వెళ్ళాక ఆ పాపకు మర్చిపోకుండా గుర్తుచేయాలి అని మనసులోనే అనుకున్నాడు.

కాఫీ హోటల్దగ్గర ఓ రెండు పుంజీల మంది నెక్కించుకుని "ఓలమ్మో! యిప్పటికే సేనా పెజాసేవ చేసీసుకున్నాం" అనుకుని బస్సును లాగించేశాడు డ్రయివరు బాబు.

ఓ గంటన్నర ప్రయాణంచేసి బైపాస్ రోడ్డులో తుని బస్టాండుకు చేరుకుంది సూపర్ డీలక్స్. తుని బస్టాండులో అచ్చంగా "బస్సు చుట్టూ పాసెంజర్లలా" మూగారు ప్రయాణికులు.

బస్సు యిప్పటికే చాలా లేటయిపోయిందంటూ "చిల్లర" మనుషుల్ని పక్కకు నెట్టేసి పెద్ద నోట్లను మాత్రం యెక్కించుకుని "ప్రెజాసేవ"తోబాటు, చిల్లరసేవ "సేవింగ్సు" చేసుకుని—కండక్టరు విజిలేయకుండానే బస్సును తోలేశాడు డ్రయివరు.

బస్సు తుని దాటాక లెవెల్ క్రాసింగు దగ్గర కొచ్చేటప్పటికి బేక్ సీటు బేబీ సంగతి సడన్‌గా గుర్తుకొచ్చింది కండక్టరుకు. బస్సుకు సరిపడా జనంవున్నారు. ఇక్కడ బస్సు ఆపేసి, ఆ పాపను దిగమనడం బావుండదు. అదీకాక ఆ పాప తనను రెండు సార్లు అడగడం బస్సులో కొంతమందైనా గమనించి వుంటారు. అలా కనుక చేస్తే - బస్సులో వాళ్ళంతా "ఐకమత్యమే మహాబలమంటూ" తన మీదకు యుద్ధానికి తయారవుతారు. అందుచేత నెమ్మదిగా డ్రయివరు దగ్గరకుపోయి గుసగుస లాడాడు. 'తుని డిపోలో డ్రయివరు టైము రిజిష్టరులో సంతకం పెట్టడం మర్చిపోయాడంటూ' ప్రయాణికులకు సర్ది చెప్పుకుని, మళ్ళీ బస్సును వెనక్కి బస్టాండుకు మళ్ళించారు.

బస్టాండుకు బయటగా రోడ్డు మీద ఆగింది బస్సు. డ్రయివరు బస్సు దిగి లోపలికి వెళ్ళాడు. కండక్టరు బేక్ సీటులో పాప దగ్గరకొచ్చి నెమ్మదిగా "పాపా! తుని వచ్చింది దిగమ్మా" అన్నాడు.

పాప కండక్టరుకు థాంక్స్ చెప్పి "బేగ్"లో చెయ్యి పెట్టింది. పాప బస్సు దిగే ప్రయత్నం ఏమీ చెయ్యకపోవడం చూసి "ఇప్పటికే చాలా ఆలస్యం అయింది దిగుదిగు" అంటూ పాపకు మాత్రమే వినిపించేలా గొణిగాడు కండక్టరు.

ప్రయాణీకుల దృష్టి బేక్ సీటు మీదకు మళ్ళింది.


"ఎందుకు దిగడం? నేను వెళ్ళవలసింది అమలాపురం అండీ! మా అమ్మ వైజాగ్‌లో మీతో చెప్పిందిగదా!" అంటూ బేగ్‌లోంచి టిక్కెట్లు తీసి కండక్టరుకు యిచ్చింది పాప.

బస్సులో వాళ్ళంతా కొశ్చన్‌మార్కు మొహాలేసుకుని చూస్తున్నారు బేక్ సీటు వంక. టిక్కెట్లు సరిగ్గా అమలాపురంకే ఉన్నాయి. ఆ పాపతల్లి తనతో చెప్పింది కాని, ఏ ఊరో ఆ హడావిడిలో తనకే గుర్తులేదు. కండక్టరుకు మతిపోతోంది. వెళ్ళవలసింది అమలాపురం అయితే "తుని వచ్చిందా" అంటూ ఆ పాప అన్నిసార్లు ఎందుకడిగిందో అర్థం కావటంలేదు కండక్టరుకు.

"మరి అమలాపురం ఎల్లాలంటే తునొచ్చిందా అని అన్నిసార్లు ఎందుకడిగినావు? ఇప్పుడు నీకోసం ప్రత్యేకంగా బస్సు ఎనక్కి తిప్పుకొచ్చేసేం గదా" వుడుక్కొంటూ అసలు విషయం కక్కేశాడు డ్రయివరు.

"అందుకోసమా బస్సు వెనక్కి వచ్చింది. మరేంలేదండీ! మా అమ్మేమో పొట్లాంకట్టి బేగ్‌లో పెట్టిన టిఫిను తుని వచ్చేంత వరకు తినవద్దని చెప్పింది. బాగా ఆకలవుతుంటే అడిగాను తుని వచ్చిందా అని" కారణం వివరించింది పాప.

మళ్ళీ ప్రజా సేవ చేసుకోవడానికి అమలాపురం దారి పట్టింది సూపర్ డీలక్సు.




నా స్వతంత్ర దేశం! ప్రజాస్వామ్యం.... (నవ్వకండి)